https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

4 PM TO 7 PM

సంపుటి: 01 / సంచిక:26 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / శుక్రవారం, సెప్టెంబర్ 11,2026

## 22ఏ అనేది పొరపాటు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం



- రేవంత్ రెడ్డి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారన్న హరీశ్
- మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్
- సామాన్యుల ఆస్తులను 22ఏ నుంచి తొలగించాలన్న హరీశ్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11

## చిదంబరంనకు సొంత పార్టీ నేతల నుంచే కౌంటర్

బ్రిక్స్ సమ్మిట్

ఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11

ఢిల్లీలో రేపు, ఎల్లుండి (సెప్టెంబర్ 12, 13 తేదీల్లో) జరగనున్న ప్రతిష్ఠాత్మక సమ్మిట్ 2026 ప్రారంభానికి ముందే కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య వైరుధ్య పూరిత వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. గత కొన్ని సమ్మిట్ల వల్ల భారత్‌కు వచ్చిన ప్రత్యక్ష ప్రయోజనాలపై సీనియర్ నేత పి. చిదంబరం అనుమానాలు వ్యక్తం చేయగా, అదే పార్టీకి చెందిన ఎంపీ శశి థరూర్ మాత్రం వేదికకు ఉన్న దౌత్య ప్రాముఖ్యాన్ని, భారత్ పాత్రను ప్రశంసించారు.భారత్ ప్రస్తుతం వంటి పలు బహుళపక్ష కూటమిలలో భాగస్వామిగా ఉదన్న చిదంబరం, గత రెండు మూడు దీ=×జూ సమావేశాల ద్వారా భారత్‌కు లభించిన స్పష్టమైన, కనిపించే ప్రయోజనాలు ఏమిటో తనకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. ఈ సమావేశాల వల్ల దేశానికి వచ్చిన ఫలితాలపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.




### శశి థరూర్ మద్దతు

చిదంబరం వ్యాఖ్యల అనంతరం మాట్లాడిన శశి థరూర్, ఈ సమ్మిట్‌ను భారత్ దౌత్య శక్తికి నిదర్శనంగా అభివర్ణించారు. ప్రపంచంలో 100కి పైగా ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు భారత్ ఒక ముఖ్యమైన వేదికను అందిస్తోందని, అందులో అత్యంత క్రియాశీలకమైన 11 దేశాల ప్రతినిధులకు భారత్ నాయకత్వం వహిస్తుండటం గర్వకారణమని థరూర్ పేర్కొన్నారు. 11 సభ్యదేశాలు కలిగిన కూటమి ప్రపంచ జనాభాలో సగానికి పైగా, అలాగే ప్రపంచ జీడీపీ లో 41 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. 2026 సమ్మిట్‌కు ఆతిథ్యమివ్వడం భారత్‌కు ఎంతో ప్రతిష్ఠాత్మకమైన విషయమని, దీనికి ప్రపంచస్థాయిలో ఎంతో దౌత్య విలువ ఉందన్నారు.

### బీజేపీ ఘాటు స్పందన

చిదంబరం చేసిన విమర్శలపై భారతీయ జనతా పార్టీ తీవ్రంగా స్పందించింది. భారత్ ఎదుగుదలను, అభివృద్ధిని జీర్ణించుకోలేని నాయకులుగా వారిని అభివర్ణిస్తూ, దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా మాట్లాడకూడదని హితవు పలికింది.

### 2026 సమ్మిట్ విశేషాలు

'స్థిరత్వం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో భారత్ నాలుగోసారి BRICS అధ్యక్ష బాధ్యతలను నిర్వర్తిస్తోంది. ఈ సమ్మిట్‌కు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో పాటు 11 సభ్య దేశాలు, 10 భాగస్వామ్య దేశాల అగ్రనేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఢిల్లీకి చేరుకుంటున్నారు.

## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ

తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు
మూసీ ప్రాజెక్టుపై ఎన్జీటీలో కొత్త పిటిషన్

- తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ
- పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల అభ్యంతరాలు
- 55 కి.మీ.లో 20 కి.మీ. అధ్యయనంపై ప్రశ్నలు
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలపై అభ్యంతరం



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ...మిగతా 2లో...



- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంపై కేటీఆర్ స్పందన
- సీఎం సోదరుల భూ కుంభకోణాన్ని బయటపెట్టినందుకే సురేఖపై వేటు వేశారని ఆరోపణ
- కాంగ్రెస్ హయాంలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా జరుగుతోందని విమర్శ
- నిషేధిత భూముల జాబితా 16 లక్షల నుంచి కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని వెల్లడి

## మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడం వెనుక భారీ భూ కుంభకోణం దాగి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులకు సంబంధించిన భూ అక్రమాలను కొండా సురేఖ కుమార్తె వెలుగులోకి తీసుకువచ్చినందుకే ఆమెపై వేటు పడిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా పర్వం కొనసాగుతోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో '22ఏ' నిషేధిత భూముల బాధితులతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ...మిగతా 2లో...

## బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ.. నలుగురు నిందితుల అరెస్ట్ : సీవీ ఆనంద్ సంచలన వివరాలు

- ఆగస్ట్ 31న బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో ఆయుధాల చోరీ
- ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ ల సహకారం
- 28, 29 తేదీల్లో రెక్కీ నిర్వహించిన మల్లేశ్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11



హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ...మిగతా 2లో...

## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు.. అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం

- మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం
- తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- హైదరాబాద్ వెలుపల 9 కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌కు ప్రాతినిధ్యం
- ప్రజా జీవితంలో భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యమన్న ప్రభుత్వం
- బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ, సీపీఐ సభ్యులు



తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్ జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.

## కాంగ్రెస్ అసమర్థ పాలనతో రైతుల పరిస్థితి దయనీయం : పువ్వాడ అజయ్

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీరు, విద్యుత్ సరఫరా దారుణంగా ఉందన్న పువ్వాడ
- ఎల్ నినోపై ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించు కోలేకపోయిందని విమర్శ
- రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సాగునీరు, విద్యుత్ సరఫరా సరిగా లేక రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం కష్టపడి పండించిన పంటలను కాపాడుకునేందుకు అవసర మైన నీటిని, నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.



## రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు.. 'తిరుక్కురళ్'ను బహుకరించిన ప్రధాని మోదీ




న్యూఢిల్లీ:

బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధాని మోదీ అరుదైన బహుమతి అందజేశారు. రష్యా రచయితలు, మేధావులను ప్రభావితం చేసిన ప్రాచీన తమిళ కావ్యం 'తిరుక్కురళ్' రష్యన్ అనువాద పుస్తకాన్ని ఆయనకు గిఫ్ట్‌గా ఇచ్చారు. శుక్రవారం భారత్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు, దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. ..మిగతా 2లో...

## భూకంపాన్ని సృష్టించిన ఇజ్రాయెల్..

### హెజ్బొల్లా టన్నెల్‌పై ఇజ్రాయెల్ దాడి.. 4.1 తీవ్రతతో భూకంపం



నేటి టెక్నాలజీ యుగంలో బాంబు దాడులు ఎంత తీవ్రంగా ఉంటాయో చెప్పేందుకు ఈ దాడి ఒక ఉదాహరణ. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడి.. ఏకంగా భారీ భూంకపాన్ని సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్ని లెబనాన్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. భూకంప తీవ్రత 4.1గా నమోదైనట్లు అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే సంస్థ వెల్లడించింది.లెబనాన్‌లో హెజ్బొల్లా ఉగ్ర సంస్థకు చెందిన స్థావరాలు ఉన్న సంగతి తెలిసిందే. వీటిపై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. తాజాగా అలి అల్ తాహెర్ రిడ్జ్ ప్రాంతంలోని హెజ్బొల్లాకు చెందిన ఒక టన్నెల్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడికి పాల్పడింది. ఈ భారీ దాడితో ఆ టన్నెల్ కూలిపోయింది. ఇదే సమయంలో బాంబు తీవ్రత కారణంగా చుట్టుపక్కల ప్రకంపనలు వచ్చాయి. దీని కారణంగా స్థానికంగా భూకంపం నమోదైంది. ఈ భూకంపం తీవ్రత 4.1గా ఉన్నట్లు అమెరికా సంస్థ తెలిపింది.దక్షిణ లెబనాన్‌లోని నబాతే సహా అనేక ప్రాంతాల్లో ప్రకంపనలు కనిపించినట్లు వెల్లడించింది. లెబనాన్‌పై జరిపిన ఈ దాడిని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, రక్షణ శాఖ మంత్రి ఇజ్రాయెల్ కట్జు కూడా అంగీకరించారు. దశాబ్దాల క్రితం ఇరాన్ నిధులతో నిర్మించిన తీవ్రవాద స్థావరాల్ని ధ్వంసం చేసినట్లు వారు ప్రకటించారు. ఈ ప్రాంతంపై పట్టు సాధించినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వీడియో కూడా విడుదలైంది.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శుక్రవారం, సెప్టెంబర్ 11,2026
www.trinetnews.com

మొదటిపేజీ తరువాయి

# రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు.. 'తిరుక్కురళ్'ను బహుకరించిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11**

బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధాని మోదీ అరుదైన బహుమతి అందజేశారు. రష్యా రచయితలు, మేధావులను ప్రభావితం చేసిన ప్రాచీన తమిళ కావ్యం 'తిరుక్కురళ్' రష్యన్ అనువాద పుస్తకాన్ని ఆయనకు గిఫ్ట్‌గా ఇచ్చారు. శుక్రవారం భారత్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు, దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. బ్రిక్స్ సదస్సుకు ముందు ఇరు దేశాధినేతలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సందర్శన సమయంలో ప్రాచీన తమిళ కావ్యం 'తిరుక్కురళ్' రష్యన్ అనువాదాన్ని పుతిన్‌కు ప్రధాని మోదీ బహుకరించారు. రష్యా రచయితలను ప్రభావితం చేసిన ఆ గ్రంథం గురించి మోదీ వివరించారు. ఈ ప్రాచీన పుస్తకం ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి సహాయపడుతుందని తాను ఆశిస్తున్నానని ఆయన అన్నారు.కాగా, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ ప్రచురించిన ఈ సంచికలో అసలైన తమిళ పద్యాలు, వాటి అనువాదం, నైరా మ్రిక్ట్యాన్ చేసిన రష్యన్ అనువాదం ఉన్నాయి. అయితే 17వ శతాబ్దం నాటికే భారతీయ తత్వశాస్త్రం, సాహిత్యం పట్ల రష్యన్లకు ఆసక్తి ఏర్పడింది. ఐరోపా భాషల్లోకి జరిగిన అనువాదాల ద్వారా రష్యన్ పండితులు, సాహిత్యవేత్తల దృష్టిని 'తిరుక్కురళ్' ఆకర్షించింది. రష్యాకు చెందిన అత్యంత ప్రసిద్ధ రచయితలలో ఒకరైన లియో టాల్‌స్టాయ్ 19వ శతాబ్దంలో ఒక అనువాదం ద్వారా 'తిరుక్కురళ్' గురించి తెలుసుకున్నారు. ధర్మం, కరుణ, అహింస వంటి అంశాలకు అందులో ఇచ్చిన ప్రాధాన్యత ఆయన తాత్విక రచనలపై ప్రభావం చూపిందని చరిత్రకారులు పేర్కొన్నారు.మరోవైపు 20వ శతాబ్దం ప్రారంభంలో మహాత్మా గాంధీతో టాల్‌స్టాయ్ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో కూడా 'తిరుక్కురళ్' గ్రంథంతో ఆయనకున్న అనుబంధాన్ని ప్రస్తావించినట్లు తెలుస్తున్నది. టాల్‌స్టాయ్ గాంధీకి 'తిరుక్కురళ్'ను సూచించారని, అందులోని బోధనలు అహింసపై గాంధీ ఆలోచనలను తీర్చిదిద్దాయని కొందరి చరిత్రకారుల వాదన. అయితే 'తిరుక్కురళ్' ప్రభావం గాంధీపై ఎంతవరకు ఉన్నదో అన్నది స్పష్టంగా నిర్ధారణకాలేదు.

# రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

## : ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

- బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారన్న సబిత
- ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంటుందని వ్యాఖ్య
- తోపులాటలో జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని ఆవేదన

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11**

తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను




అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

# ప్రభాస్‌కు కేటీఆర్ ప్రాంక్ కాల్.. సోషల్ మీడియాలో వీడియో వైరల్!

- ప్రభాస్‌కు కేటీఆర్ చేసిన ప్రాంక్ కాల్ వీడియో వైరల్
- జెన్-జీ యువతతో పోడ్‌కాస్ట్ సందర్భంగా సరదా ఘటన
- రోడ్డుపై ఫోన్ దొరికిందంటూ యువతి చెప్పడంతో కాల్ కట్ చేసిన ప్రభాస్
- వెంటనే మళ్లీ ఫోన్ చేసి అసలు విషయం వివరించిన కేటీఆర్
- సోషల్ మీడియాలో నవ్వులు పంచుతున్న ఈ వీడియో క్లిప్

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు సంబంధించిన ఒక సరదా వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒక పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో భాగంగా ప్రభాస్‌కు కేటీఆర్ చేసిన ప్రాంక్ కాల్ నెటిజన్లను విశేషంగా అలరిస్తోంది.కేటీఆర్ ఇటీవల 'జెన్-జీ' యువతతో కలిసి ఒక పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, ఎవరో ఒక స్టార్ హీరోకు ఫోన్ చేయాలని అక్కడి యువత కేటీఆర్‌ను కోరారు. వారి విజ్ఞప్తి మేరకు ఆయన వెంటనే ప్రభాస్‌కు ఫోన్ చేశారు. అయితే, కేటీఆర్ పక్కనే ఉన్న ఒక యువతి ఫోన్ తీసుకుని, "ఈ ఫోన్ రోడ్డుపై దొరికింది" అని చెబుతూ ప్రభాస్‌ను సరదాగా ఆటపట్టించారు.ఆ మాట వినగానే ప్రభాస్ వెంటనే కాల్ కట్ చేయడంతో షోలో ఒక్కసారిగా నవ్వులు విరిశాయి. ఆ తర్వాత కేటీఆర్ తిరిగి ఫోన్ చేసి, అది కేవలం సరదా కోసం చేసిన 'ప్రాంక్' అని, తాను ప్రస్తుతం యువతతో కలిసి పాడ్‌కాస్ట్‌లో ఉన్నానని అసలు విషయం వివరించారు. ఈ ఆహ్లాదకరమైన సంభాషణకు



సంబంధించిన వీడియో క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.

మొదటిపేజీ తరువాయి

# మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలోఎదురుదెబ్బ

మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు.ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు.పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదనను కూడా వెల్లడించాల్సి ఉంది.మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16కు వాయిదా వేసింది. ఆ విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన పర్యావరణ అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. ఇప్పటికే మూసీ ప్రక్షాళనను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎన్జీటీలో తాజా పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

మొదటిపేజీ తరువాయి

# 22ఏ అనేది పొరపాటు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం

తెలంగాణలో నిషేధిత భూముల జాబితా 22ఏ వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో 22ఏ బాధితులతో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ధ్వజమెత్తారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై కన్నేశారని హరీశ్ రావు ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తే చాలని ప్రచారం చేసుకున్నారని, కానీ నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసినా బాధితులకు ఎలాంటి పరిష్కారం దొరకడం లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం... బడా బాబులు నిర్మించిన అక్రమ నివాసాల జోలికి మాత్రం వెళ్లడం లేదని విమర్శించారు.రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. 2ఏ నిషేధిత జాబితా నుంచి ముఖ్యమంత్రి నివాసాన్ని తొలగించినప్పుడు, అదే జాబితాలో ఉన్న సామాన్య ప్రజల నివాసాలను, భూములను ఎందుకు తొలగించడం లేదని నిలదీశారు. తక్షణమే పేదల, సామాన్యుల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

# కేటీఆర్ సంచలన ఆరోపణలు

మంచిర్యాలలో మొదలైన ఈ భూ కుంభకోణం వ్యవహారం ముదరడంతో, దానిని కప్పిపుచ్చేందుకు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న 22ఏ నిషేధిత భూముల జాబితా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూదందాకు ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.ఒక మంత్రి కుమార్తె ప్రభుత్వంలోని అవినీతిని ప్రశ్నిస్తే, ఏకంగా ఆ మంత్రినే పదవి నుంచి తొలగించడం దారుణమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ ఉదంతం కాంగ్రెస్ పాలనలో పారదర్శకత ఎంతలా లోపించిందో తేటతెల్లం చేస్తోందని ఆయన విమర్శించారు.

మొదటిపేజీ తరువాయి

# బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ.. నలుగురు నిందితుల అరెస్ట్

ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు.దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు.ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

మొదటిపేజీ తరువాయి

# కాంగ్రెస్ అసమర్థ పాలనతో రైతుల పరిస్థితి దయనీయం

ఈ ఏడు ఎల్ నినో ప్రభావం ఉంటుందని ముందుగానే వాతావరణ శాఖ సంకేతాలు ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడంలో విఫలమైందని పువ్వాడ మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థ నిర్ణయాల వల్లే క్షేత్రస్థాయిలో పంట పొలాలు ఎండిపోయే తీవ్రమైన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ఎద్దడి, విద్యుత్ కోతల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ, బాధితుల తరపున పోరాటాలు చేస్తున్నప్పటికీ పాలకులు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు.ప్రభుత్వ ఉదాసీనత కారణంగా జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వెంటనే స్పందించి అధికారులు క్షేత్రస్థాయిలో ఎండిపోతున్న పంటలను స్వయంగా పరిశీలించాలని, అత్యవసర ప్రాతిపదికన సాగునీరు, అరకొర కోతలు లేకుండా ఉచిత విద్యుత్ సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136